క్లుప్తంగా

మంత్రి కోమటిరెడ్డికి శుభాకాంక్షలు



మంత్రి కోమటిరెడ్డిని సన్మానించి, శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఉగాది పండుగను పురస్కరించుకుని రోడ్లు భవనాల శాఖ, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో ఆదివారం ఆదిబట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ.. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నాయకులు దెంది రాంరెడ్డి, కొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, సంరెడ్డి మహిపాల్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, శివగౌడ్, ధనరాజ్, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని 'మన్‌కీ బాత్'



ప్రసార కార్యక్రమాన్ని వీక్షిస్తున్న కమలనాథులు

యాచారం: ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన 'మన్‌కీ బాత్' 120 ప్రసార కార్యక్రమాన్ని ఆదివారం మాజీ ఎంపీపీ కొప్పు సుకన్య నివాసంలో బీజేపీ శ్రేణులు వీక్షించారు. ఇందులో పార్టీ ఎస్సీమోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బాషా, యాచారం మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్, నాయకులు పున్న శివకుమార్, గొరిగే బీరప్ప, వన్నెవాడ రవీందర్‌రెడ్డి, నీలం రమేష్, నడుకుడి కృష్ణ, పత్తి రాజు, పల్లపు నరేష్, కాలె శ్రీకాంత్, ముప్పిడి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభించిన నాయకులు

తలకొండపల్లి: మండల పరిధి వెల్జాల్ గ్రామంలో ఆదివారం ఉగాది పండుగ సందర్భంగా బీజేపీ నాయకుడు తిరుమణి రాఘవేందర్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాటసారుల దాహార్తిని తీర్చడం కోసం చలివేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం పలువురు రాఘవేందర్‌ను అభినందించారు.

ఉజ్వల భవిష్యత్‌కు 'విశ్వావసు' బాటలు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తుకు విశ్వావసు నామ సంవత్సరం బాటలు వేయనుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఉగాది పండగ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ.. తెలుగు పండగలలో తొలి పండుగ ఉగాది అని, యుగాల ప్రారంభానికి ఆదిగా నిలిచే వేడుక అయినందునా యుగాది ఉగాదిగా మారిందని పురాణాలు చెబుతున్నాయన్నారు. తెలుగు కొత్త సంవత్సరంలో ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తుందని, కొత్త ఆశలను చిగురింపజేస్తుందన్నారు. ఈ ఉగాది ప్రజల జీవితాల్లో ఉషస్సులు నింపాలని కోరారు. విశ్వావసు నామ సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని, సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. ఉగాది అనేది షడ్రుచుల సమ్మేళనమని, ప్రజలందరూ మంచి చెడులను, కష్టసుఖాలను ఒకేలా స్వీకరించాలని ఉగాది పచ్చడి చెబుతుందన్నారు.

హెచ్‌సీయూ భూముల వేలాన్ని ఆపాలి

పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్

చేవెళ్ల: విద్యాసంస్థలకు సంబంధించిన భూములను అమ్మడం అనేది విద్యావ్యవస్థ పతనానికి దారి తీసినట్లేనని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్ అన్నారు. చేవెళ్లలో ఆదివారం ఆయన విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని హెచ్‌సీయూ భూముల అమ్మకానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసు దౌర్జన్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. హెచ్‌సీయూ భూముల వేలాన్ని వెంటనే ఆపాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు జేసీబీలను అడ్డుకునే ప్రయత్నాలు చేశారన్నారు. అడ్డుకున్న విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులను పోలీసులు అరెస్టులు చేసినట్లు తెలిపారు. అరెస్టు చేసిన విద్యార్థులను విద్యార్థి సంఘాల నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



ఆమనగల్లు: పచ్చడి పంపిణీ చేస్తున్న కన్యకాపరమేశ్వరీ ఆలయ కమిటీ



మంచాల: తాళ్లపల్లిగూడ రామలింగేశ్వర ఆలయంలో పంచాంగ శ్రవణం



కడ్తాల్: పంచాంగ పఠనం చేస్తున్న వేదపండితుడు వెంకటేశ్వర శర్మ

ఘనంగా షడ్రుచుల సమ్మేళనం

తెలుగు నామ సంవత్సర ఉగాది వేడుకలను ఆదివారం ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా తమ ఇంటిని పచ్చని తోరణాలతో అలంకరించారు. ఇల్లు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. షడ్రుచుల సమ్మేళనం ఉగాది పచ్చడిని సేవించారు. పిండి వంటలు బచ్చాలను ఆరగించారు. అనంతరం దేవాలయాల వద్ద పురోహితులు పంచాంగ పఠనం చేయగా.. తమ జాతకం ఎలా ఉండబోతుందని అడిగి తెలుసుకున్నారు. సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

–సాక్షి, నెట్‌వర్క్



ఆమనగల్లు: పోలెపల్లిలో హనుమాన్ ఆలయంలో పచ్చడిని పంపిణీ చేస్తున్న స్వాములు



మాడ్గుల: కోలుకులపల్లిలో పంచాంగ పఠనం చేస్తున్న అర్చకుడు ప్రవీణ్ కుమార్ శర్మ



యాచారం: నక్కర్తమేడిపల్లి ఆంజనేయస్వామి దేవాలయంలో పంచాంగ పఠనం చేస్తున్న పురోహితుడు ప్రవీణ్‌కుమార్



ఇబ్రహీంపట్నం: ఈశ్వరాంజనేయ ఆలయంలో..



ఆమనగల్లు: పంచాగ పఠనం చేస్తున్న రామకృష్ణశర్మ



కడ్తాల్: మైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పండుగలు మత సామరస్యానికి చిహ్నాలు

తలకొండపల్లి: పండుగలు మత సామరస్యానికి చిహ్నాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని ఆదివారం తలకొండపల్లి మండల కేంద్రంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఆర్ఎస్‌తో పాటు మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ హాజరయ్యారు. ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని సూచించారు.

2న ఉచిత కంటి వైద్యశిబిరం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ సాయి ఆప్టికల్స్ ఆవరణలో ఏప్రిల్ 2న సికింద్రాబాద్ పుష్పగిరి కంటి ఆస్పత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు కొత్ర మల్లేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో చూపు మందగించిన వారికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నేత్ర సమస్యలు ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పన్నుల చెల్లింపునకు ప్రత్యేక కౌంటర్

షాద్‌నగర్: ఆస్తి పన్ను చెల్లించేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ సునీత ఒక ప్రకటనలో తెలిపారు. రంజాన్ సందర్భంగా సోమవారం సెలవు ఉన్న నేపథ్యంలో పుర కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మార్కెట్‌కు రూ.3.24 కోట్ల ఆదాయం

చైర్‌పర్సన్ యాట గీత



ఆమనగల్లు: ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీకి 2024– 25 ఆర్థిక సంవత్సరానికి రూ.3.24 కోట్ల ఆదాయం సమకూరిందని చైర్‌పర్సన్ యాటగీత తెలిపారు. ఈ ఏడాది లక్ష్యాన్ని మించి ఆదాయం రానుందని పేర్కొన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు కార్యాలయంలో ఆదివారం వైస్ చైర్మన్ గూడురి భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి ఆమె మాట్లాడారు. ఈ ఏడాది మార్కెట్‌కు సీసీఐ ద్వారా రూ.1.90 కోట్లు, వరిధాన్యం విక్రయంచడం ద్వారా రూ.34 లక్షలు, మిల్లర్లు ధాన్యం కొనుగోలు ద్వారా రూ.1 కోటి ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ పాలకవర్గం, సిబ్బంది, అధికారుల సహకారంతో ఇది సాధ్యమైందని వెల్లడించారు. వచ్చే ఏడాది ఆదాయం మరింత పెరిగేలా దృష్టి సారించామని చెప్పారు. చెక్‌పోస్టుల వద్ద మరింత నిఘా పెడతామని, జీరో వ్యాపారానికి తావులేకుండా చర్యలు తీసుకుంటామని వివరించారు. దిగుబడిని దళారులకు విక్రయించకుండా వ్యవసాయ మార్కెట్‌యార్డులో విక్రయించి మద్దతుధర పొందాలని రైతులకు సూచించారు. సమావేశంలో మార్కెట్ డైరెక్టర్లు కండె పాండురంగయ్య, వస్పుల శ్రీశైలం, అజీం, నరేశ్‌నాయక్, వెంకట్‌రెడ్డి, జంగయ్య, రమేశ్‌గౌడ్, శ్యాంసుందర్‌రెడ్డి, యాదయ్య, మార్కెట్ సూపర్‌వైజర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బాల్యమిత్రుడికి ఆర్థిక సహాయం

మంచాల: అనారోగ్యంతో బాధ పడుతున్న జాపాల గ్రామానికి చెందిన బాల్య మిత్రుడు యాట దశరథకు స్నేహితులు అండగా నిలిచారు. ఆదివారం 2002– 2003 పదో తరగతి బ్యాచ్ స్నేహితులు.. బాధితుడికి రూ.60 వేలు ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా ఆసరాగా నిలిచిన మిత్రులకు దశరథ కృతజ్ఞతలు తెలిపారు.




దశరథకు ఆర్థిక సహాయం అందజేస్తున్న మిత్రులు

పుష్కరకాలం అయినా..

నాయీబ్రాహ్మణ సేవాసంఘం కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులు ప్రారంభించి పుష్కర కాలం దాటింది. విడతలుగా నిధులు మంజూరు అయ్యాయి. అవి ఉన్నంత మేర పనులు జరిగాయి. అయినా భవనం అసంపూర్తిగానే దర్శనమిస్తోంది. మరో రూ.10 లక్షలు అయితే కాని పనులు పూర్తికావని సంఘం నాయకులు పేర్కొంటున్నారు.

- పూర్తికాని కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు
- విడతలుగా నిధులు.. అయినా వీడని గ్రహణం



నిలిచిన నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో నాయీబ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. పనులు ప్రారంభమై సుమారు 14 ఏళ్లు కావస్తున్నా నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాలకు చెందిన నాయీబ్రాహ్మణులు.. కమ్యూనిటీ హాల్ నిర్మించాలని గతంలో పలుమార్లు ప్రజాప్రతినిధులను కోరారు. దీంతో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, నాటి ఆమనగల్లు సర్పంచ్ యాదయ్యలు 2011లో భవన నిర్మాణానికి 180 గజాల స్థలం కేటాయించారు.

మరో రూ.10లక్షలు అయితే కాని..

నిర్మాణం కోసం జిల్లా పరిషత్ నిధుల నుంచి నాటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ రూ.3 లక్షలు మంజూరు చేయించారు. దీంతో నిర్మాణ పనులు ప్రారంభించారు. నిధులు ఉన్నంత మేరకు స్లాబు వేసి ఆపేశారు. అనంతరం 2015లో నాటి జెడ్పీటీసీ కండె హరిప్రసాద్ జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.1 లక్ష కేటాయించడంతో భవనంలో ఓ గది నిర్మాణం మాత్రమే పూర్తి చేశారు. నిధుల లేమితో తరచూ నిర్మాణ పనులకు ఆటంకం కలుగుతుండటంతో.. సరిపడా నిధులు కేటాయించాలని బ్రాహ్మణ సంఘం నాయకులు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో నిర్మాణ పనులకు ఆర్థిక సహాయం చేయాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డిని కోరగా.. రూ.3 లక్షలు అందజేశారు. దీంతో గోడలు, ఇతర పనులను పూర్తిచేశారు. అయినప్పటికీ మరో రూ.10లక్షలు అయితే కాని భవనం పూర్తి కాదని సంఘం నాయకులు పేర్కొంటున్నారు. అవసరమైన నిధులు మంజూరు చేసి, భవనాన్ని పూర్తి చేయించాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి



అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలి. ఎవరూ పట్టించుకోకపోవడంతో చాలా ఆలస్యమైంది. ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలి. భవనం వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– రమేశ్, నాయీబ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడు

నేడు ఈద్-ఉల్-ఫితర్

- నెల రోజుల ఉపవాస దీక్ష ముగింపు
- ఈద్గాలు, మసీదులు ముస్తాబు



ఆమనగల్లు: ప్రార్థనల కోసం ముస్తాబైన ఈద్గా



కడ్తాల్: ఈద్గా వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మసీద్ కమిటీ సభ్యులు

ముస్లింలు అతి పవిత్రంగా భావించే రంజాన్ వేడుకలు నేడు జరుపుకోనున్నారు. నెల రోజుల పాటు చేపట్టిన ఉపవాస దీక్షలను నేటితో విడవనున్నారు. ఆకాశ తీరంలో నెల వంక కనిపించడంతో మత పెద్దలు రంజాన్ ప్రకటించారు. ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొనే రెండు పండుగలలో మొదటిది రంజాన్ (ఈద్–ఉల్–ఫితర్). ఈ సందర్భంగా మసీదులు, ప్రార్థనలు (నమాజ్) చేసే ఈద్గా మైదానాలు ముస్తాబయ్యాయి.

ఆమనగల్లు/కడ్తాల్/మంచాల/పహాడీషరీఫ్: రంజాన్(ఈద్–ఉల్–ఫితర్) పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా ఈద్గాలు, మసీదులు ముస్తాబయ్యాయి. సోమవారం ఉదయం నుంచే నమాజ్ చేయనున్న నేపథ్యంలో ఈద్గాలు, మజీద్‌లను జల్‌పల్లి మున్సిపాలిటీ అధికారులు తీర్చిదిద్దారు. ఈద్గాల పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించారు. టెంట్లు, విద్యుత్ సదుపాయం కల్పించారు. వాటర్ ట్యాంకర్లను అందుబాటులో ఉంచారు. జల్‌పల్లి, వాదే ముస్తఫా, కొత్తపేట, పహాడీషరీఫ్ ఈద్గాలను మున్సిపాలిటీ కమిషనర్ బి.వెంకట్రామ్ పరిశీలించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

పోలీసుల ప్రత్యేక నిఘా

ఈద్గాలలో వేలాది మంది ముస్లింలు ప్రార్థనలు చేయనున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పహాడీషరీఫ్, బాలాపూర్ పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. ఇదే విషయమై రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డిలు బందోబస్తును పర్యవేక్షించి, సిబ్బందికి సూచనలు చేశారు. ప్రధానమైన పహాడీషరీఫ్, కొత్తపేట, వాదే ముస్తఫా ఈద్గాలకు సంబంధించి.. మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి, పహాడీషరీఫ్, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్లు గురువారెడ్డి, సుధాకర్‌లు మత పెద్దలతో సమావేశమయ్యారు. ఉపవాస దీక్షలు చివరి రోజు కావడంతో దుకాణాలు కిటకిటలాడాయి. ముస్లింలు భారీగా షాపింగ్ చేశారు. దీంతో ప్రధాన రహదారుల్లో సందడి కనిపించింది. చివరి రోజు ఇఫ్తార్ విందులు పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు.

కడ్తాల్‌లో..

రంజాన్(ఈదు–ఉల్–ఫితర్)ను పురస్కరించుకుని మండల పరిధిలోని ఈద్గాలు, మసీదులు ముస్తాబయ్యాయి. నమాజ్‌కోసం ఈద్గాలను సిద్ధం చేశారు. వేసవి నేపథ్యంలో ఈద్గాల వద్ద చలువ పందిళ్లు, షామియానాలు, తాగునీటి తదితర వసతులు కల్పించారు. మండల కేంద్రంలోని ఈద్గా వద్ద ఉదయం 9 గంటలకు నమాజ్ ప్రారంభమవుతుందని, సకాలంలో ముస్లింలు హాజరుకావాలని మసీద్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్ కోరారు. ఈద్గా వద్ద ఏర్పాట్లను ఆదివారం కమిటీ అధ్యక్షుడు రవూఫ్, ఉపాధ్యక్షుడు జావీద్, నాయకులు జహంగీర్‌అలీ, ఇర్షాద్ పర్యవేక్షించారు.

మంచాలలో..

రంజాన్‌ను పురస్కరించుకుని గ్రామాల్లో మసీదులు, ఈద్గాలు ముస్తాబయ్యాయి. ఈద్గాల వద్ద ప్రార్థనలు అనంతరం ముస్లింల అలయ్.. బలయ్ అనవాయితీ. వేసవి నేపథ్యంలో ప్రార్థనాలయాల వద్ద టెట్లు, షామియానాలు సిద్ధం చేశామని కో–ఆప్షన్ మండల మాజీ సభ్యుడు మహ్మద్ సలాలం ఆజాద్ తెలపారు.

ఆమనగల్లులో..

రంజాన్‌ను పురస్కరించుకుని పట్టణంలోని మసీదులు, ఈద్గాలు ముస్తాబయ్యాయి. మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించగా.. ప్రత్యేక ప్రార్థనల కోసం ఈద్గాలను సుందరీకరించారు. వేసవి నేపథ్యంలో టెంట్లు, షామియానాలు ఏర్పాటు చేశారు. తాగునీటి తదితర సౌకర్యాలు సిద్ధం చేశారు. ఈద్గా వద్ద ఏర్పాట్లను మసీదు కమిటీల అధ్యక్షులు, నాయకులు పరిశీలించారు.



ఆమనగల్లు: విద్యుత్ కాంతులతో మసీదు

దైవ సన్నిధిలో



నెల రోజుల పాటు నియమ నిష్టలతో రంజాన్ ఉపవాస దీక్షలను కొనసాగించాం. పండుగ రోజు (సోమవారం)న ఉదయమే ఈద్గాలకు వెళ్లి సామూహిక ప్రార్థనలు చేస్తాం. అనంతరం పెద్దల ఆశీస్సులు తీసుకుంటాం. 30 రోజులు అల్లాహ్ నామస్మరణతో గడపడం ద్వారా సన్మార్గంలో నడవడం, ఉపవాస దీక్షల ద్వారా ఆరోగ్యానికి కూడా మేలు చేకూరుతుంది. ఈ మాసంలో ఉన్నంతలో దాన ధర్మాలు చేస్తాం.

– సయ్యద్ అబ్దుల్ రవూఫ్, షాహీన్‌నగర్

సేవాగుణాన్ని అలవర్చుకోవాలి

టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్



విద్యార్థులతో మాట్లాడుతున్న గౌరీ సతీశ్

మొయినాబాద్‌రూరల్: విద్యార్థి దశ నుంచి సేవాగుణం అలవర్చుకోవాలని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్ పేర్కొన్నారు. వారం రోజులుగా హైదరాబాద్ దోమలగూడలోని ఏవీ కళాశాల విద్యార్థులు నక్కలపల్లిలో వారంరోజుల పాటు ఎన్ఎస్ఎస్ వేసవి ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఆదివారంతో ముగిసిన ఎన్ఎస్ఎస్ సభను ప్రోగ్రామ్ అధికారి అంజయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరీ సతీశ్ పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడే విజ్ఞానం పెంపొందుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ అనేది విద్యార్థులకు ఒక చక్కటి అవకాశం అన్నారు. విద్యార్థులు ఉన్నతంగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. దేవాలయ ప్రాంగణం శుభ్రత, రోడ్లకు ఉన్న చెట్లకు పాదులు, విద్యా, ఉద్యోగం సంబంధిత ఇంటింటి సర్వే, సామాజిక సమస్యలపై ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించినందుకు అభినందించారు. అనంతరం ఎన్ఎస్ఎస్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో నిరంజన్‌గౌడ్, నీలకంఠం, అంజయ్యగౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజుగౌడ్, గ్రామస్తులు, యువకులు, నాయకులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

దాహార్తి తీర్చేందుకు దోహదం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సేవాసమితి సభ్యులు

సత్యసాయి సేవా సమితి చేవెళ్ల శాఖ కన్వీనర్ రామగౌడ్

చేవెళ్ల: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం చేస్తాయని సత్యసాయి సేవా సమితి చేవెళ్ల శాఖ కన్వీనర్ రామగౌడ్ అన్నారు. మున్సిపాలిటీలోని బస్‌స్టేషన్ ఎదుట ఆదివారం సత్యసాయి సేవా సమితి చేవెళ్ల శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సేవాసమితి సభ్యులు మాట్లాడుతూ.. ప్రతి ఏడాది సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఈ చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. మానవ సేవే మాధవ సేవ అని సత్యసాయి చూపించిన మార్గం అందరికీ ఆదర్శమన్నారు. ఆయన చూపించిన మార్గంలోనే సేవా సమితి నడుస్తోందని చెప్పారు. వేసవి కాలం ముగిసే వరకు ఈ చలివేంద్రం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు గోపాలచారి, విజయ్‌భాస్కర్, దివాకర్‌రెడ్డి, వెంకటేశ్, అంజనేయులు, మధు, ప్రభు, విఠల్, దేవేంద్రచారి, శంకరయ్య, మాధవరెడ్డి, పెంటారెడ్డి తదితరులు ఉన్నారు.